క్లుప్తంగా

జాబ్‌మేళాకు 76 మంది హాజరు

కనిగిరిరూరల్: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జాబ్‌మేళా నిర్వహించారు. జాబ్‌మేళాకు 76 మంది అభ్యర్థులు హాజరు కాగా 44 మందికి ఎంపికైనట్లు అధికారులు ఈ శ్రీనివాసచారి, బెనర్జీ, సదన్ తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జె. ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

చాకిరాలలో చర్చి ప్రారంభం

కనిగిరిరూరల్: మండలంలోని చాకిరాలలో తెలుగు బాప్టిస్ట్ చర్చి పునః ప్రారంభోత్సవం వైభవంగా నిర్వహించారు. నూతన చర్చిని దుర్గం బాప్టిస్ చర్చి పాస్టర్ జాకబ్ ఏఎస్ కుమార్, ఎంపీపీ దంతులూరి ప్రకాశం ప్రారంభించారు. అనంతరం చాకిరాల సంఘ కాపరి జెన్నేపోగు ఎలీషా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, క్రీస్తు సందేశాన్ని ఇచ్చారు. సంఘ కమిటీ సభ్యులు దంతులూరి వెంకటయ్య, వేమవరపు దేవదానం, మాసిపోగు ఆదాం, ముద్దా దావీదు, గూడూరి రవి, తాతపుడి పెద్ద రోశయ్య, సర్పంచ్ మందా అరవింద్ లూకా పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న జడ్జీ రూపశ్రీ

కనిగిరిరూరల్: వచ్చే నెల 13న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, కనిగిరి జూనియర్ సివిల్ జడ్జి బి.రూపశ్రీ అన్నారు. స్థానిక కోర్టు పరిధిలో ఉన్న పోలీస్ అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి బి.రూప శ్రీ మాట్లాడుతూ రాజీ మార్గమే రాజమార్గం అన్నారు. కక్షిదారులు రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించుకునేటట్లు చూడాలని పోలీస్ వారిని ఆదేశించారు. జాతీయ లోక్ అదాలత్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోని కేసులు పరిష్కరించుకునేలా పోలీసులు కృషి చేయాలన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా వాహనాలుంటే చర్యలు

కనిగిరిరూరల్: నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నడిపితే చర్యలు తప్పవని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ డి.జస్వంత్ అన్నారు. కనిగిరి డిపో పరిధిలోని కంభం రోడ్డులో సోమవారం వాహనాల తనిఖీని ఎంవీఐ డి.జస్వంత్, డిపో మేనేజర్ మొహమ్మద్ సాయనా బేగం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని, సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని, భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ప్రైవేట్ వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే చర్యలు తప్పవన్నారు. రవాణా శాఖ, ఏపీఎస్ ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించకుంటే చర్యలు

హనుమంతునిపాడు: అంగన్‌వాడీ కార్యకర్తలు సెంటర్లను సక్రమంగా నిర్వహించని కార్యకర్తలపై చర్యలు తప్పవని ఐసీడీఎస్ సీడీపీఓ షేక్ ఆయాషా బేగం అన్నారు. మండలంలోని తిమ్మారెడ్డిపల్లి, వెంగలపల్లి, గ్రామ పంచాయతీలోని అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారుల రోలు, హాజర్, గర్భిణులు, బాలింతల రికార్డులు పరిశీలించారు. అనంతరం వెంగపల్లిలో జరిగిన సెక్టార్ సమావేశంలో పాల్గొన్నారు. గ్రామాల్లో సెంటర్లు సక్రమంగా నిర్వహించడం లేదని ఫిర్యాదులు వస్తే శాఖాపర చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం తిమ్మారెడ్డిపల్లి సెక్టర్ పరిధిలో కార్యకర్తల రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ షేక్ గౌష్ నిసాబేగం, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉన్నా..ఉపయోగం సున్నా !

- పంచాయతీల్లో నిరుపయోగంగా డంపింగ్ యార్డులు
- కూటమి ప్రభుత్వంలో వ్యర్థాల మధ్య నివశిస్తున్న ప్రజలు
- డంపింగ్ యార్డులను వాడుకలోకి తేవడంలో అధికారుల విఫలం
- పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్న క్షేత్రస్థాయి అధికారులు



చెరువుకొమ్ముపాలెంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పరిస్థితి ఇలా..

పొన్నలూరు: పరిశుభ్రమైన స్వచ్ఛ గ్రామాలను రూపొందించడమే లక్ష్యమంటూ ఊదరగొట్టిన కూటమి ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయడం లేదు. అధికారుల మధ్య సమన్వయ లోపం, నిర్లక్ష్యంతో గ్రామాల్లో నిర్మించిన చెత్త సంపద కేంద్రాలు అక్కడక్కడ నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. గతంలో అన్ని పంచాయతీల్లో చెత్త నుంచి సంపద కేంద్రాలు నిర్మించినా వాటిని నేడు కూటమి ప్రభుత్వం వినియోగించకపోవడంతో నిరుపయోగంగా మారిపోయాయి. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన స్వచ్ఛ ఆంధ్రా- స్వర్ణాంధ్ర కార్యక్రమం కల క్షేత్రస్థాయిలో నీరుగారి పోతుంది. వాస్తవంగా గ్రామీణ ప్రాంతాల్లోని వీధులు, రహదారులు, నివాసల మధ్య ఉండే చెత్తా వ్యర్థాలను ఊరికి దూరంగా నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించి అక్కడ ఏర్పాటు చేసన తొట్లల్లో వేసి తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి వర్మీ కంపోస్ట్ ద్వారా పంచాయతీలు ఆదాయం పొందాలన్నదే వీటి ప్రధాన లక్ష్యం. అందులో భాగంగానే తొలుత పంచాయతీల్లో డంపింగ్ యార్డుల ఏర్పాటుకు స్థలాలు గర్తించి దాదాపుగా అన్ని పంచాయతీల్లో ఏర్పాటు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత కొన్ని పంచాయతీల్లో వీటిని ఉపయోగించకపోవడంతో చిల్లచెట్లు పెరిగి, మందుబాబులకు అడ్డాగా, అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారి గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో పలు గ్రామాల్లో సేకరించిన చెత్తను గ్రామ శివారుల్లో రోడ్ల పక్కన పడవేస్తున్నారు. ఈ విధమైన చర్యలు వలన చెత్త కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లడంతో పాటు గాలికి చెత్త రోడ్లపైకి రావడంతో ఆయా గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

దంపింగ్‌యార్డుల పరిస్థితి ఇది..

నియోజకవర్గంలోని పొన్నలూరులో 24, కొండపి 19, జరుగుమల్లి 20, మర్రిపూడి 21, టంగుటూరు 18, శింగరాయ కొండ 10 చొప్పున మొత్తం 112 గ్రామ పంచాయితీలు ఉన్నాయి. అయితే అన్ని గ్రామ పంచాయితీల్లో దాదాపుగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిర్మించినా కొన్ని పంచాయతీల్లో వాడుకలో లేవు. డంపింగ్ యార్డులను వినియోగంలోకి తీసుకువస్తే గ్రామాల్లో సేకరించిన చెత్తను రీసైక్లింగ్ చేసి గ్రామ పంచాయితీలు ఆదాయం పొందడానికి అవకాశం ఉంది. ఆదాయం పొందిన తరువాత గ్రామాలు అభివృద్ధి దోహదపడుతుంది. కానీ చాలా పంచాయతీలో కూటమి ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం, పనితీరుతో వాటిని ఉపయోగించడానికి అడుగులు పడడం లేదు. పొన్నలూరు మండలంలో పెదవెంకన్నపాలెం, తిమ్మపాలెం, చెరువుకొమ్ముపాలెం, మాలపాడు ఇలా మరి కొన్ని పంచాయతీల్లో వాడుకలో లేవు.

అధికారుల మధ్య సమన్వయ లోపం

కూటమి ప్రభుత్వం ఏర్పడి సుమారుగా 14 నెలలకు పైగా అవుతుంది. అయితే ఇన్ని నెలలుగా చాలా పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు వాడుకలో ఉండటం లేదు. మండల, గ్రామ స్థాయి అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో పాటు చూసిచూడనట్లు వ్యవహరించడంతో నిరుపయోగంగా మారిపోతున్నాయి. ప్రతి ప్రభుత్వ కార్యక్రమాలు, సమావేశాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు వీటిపై ఉపన్యాసాలు ఇస్తున్నా క్షేత్రస్థాయిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల పని తనం ప్రశ్నార్థకంగా మారిపోయింది. ఇదిఇలా ఉంటే ప్రతి శనివారం కూటమి ప్రభుత్వం స్వచ్ఛంద్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమం చేపడుతున్నా ఇదంతా కూడా తూతూమంత్రంగా ఫొటోలకే పరిమితం అవుతున్నట్లు తెలుస్తోంది. మొత్తంగా చెత్త నుంచి సంపద తయారీ కేం ద్రాల పనితనం ఒక అడుగు ముందుకు నాలుగు అడుగులు వెనక్కి అన్న చందంగా మారాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆయా పంచాయతీల్లోని డంపింగ్ యార్డులను వాడుకలోకి తేవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



మాలపాడులో బాటసారులకు నిలయంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం



పెదవెంకన్నపాలెంలో చిల్లచెట్ల మధ్యలో నిరుపయోగం ఉన్న డంపింగ్ యార్డు



తిమ్మపాలెంలో ఖాళీగా చిల్లచెట్ల మధ్య దర్శనమిస్తున్న చెత్త తొట్లు

నేడు ఉచిత వైద్య నిర్ధారణ శిబిరం

కనిగిరిరూరల్: సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో 6 నుంచి 18 ఏళ్ల లోపు వయస్సు కలిగిన విద్యార్థులకు ఈ నెల 26న స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉచిత వైద్య నిర్ధారణ పరీక్షల శిబిరం నిర్వహించనున్నట్లు ఎంఈఓలు డీవీ సుబ్బారావు, యువీ నారాయణరెడ్డి, ఐఈఆర్‌టీ సైమన్ తెలిపారు. ఆరు మండలాల దివ్యాంగ విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9849345654 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

రూ.20 వేల ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న దద్దాల నారాయణ, నేతలు

పామూరు: స్థానిక కరెంట్ ఆఫీస్ కాలనీకి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త షేక్.సద్దాం కొంతకాలంగా కిడ్నీ, పక్షవాతం సమస్యలతో మంచానికే పరిమితమయ్యాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ, పలువురు నేతలు సద్దాం ఇంటికి వెళ్లి పరామర్శించి రూ.20 వేల ఆర్థికసాయం అందజేశారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, కోఆప్షన్ షేక్.నాయబ్‌రసూల్, పార్టీ యూత్ మండల అధ్యక్షుడు యాదాల వెంకట సాయికిరణ్, కల్లూరి రామిరెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్.చాంద్‌బాషా, అంబటి కొండారెడ్డి, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, ఇర్రి కృష్ణారెడ్డి, చెనికల శ్రీనివాసులు, శ్రీరామ శ్రీనివాసులు, షేక్.కాలేషా, ఎంపీటీ నాయబ, జి.ఆదినారాయణరెడ్డి, కటికల వెంకటరత్నం, సైకం ఏడుకొండలు, మర్రి రాజుయాదవ్, పి.బాలసిద్దయ్య, రాచకొండ మహేంద్ర, షేక్.నాగూర్‌బాష పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి



నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీఐ భీమానాయక్

పామూరు: మండల కేంద్రమైన పామూరులో ఈనెల 31వ తేదీ ఆదివారం వినాయక నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు సీఐ ఎం భీమానాయక్ తెలిపారు. ఈసందర్భంగా నిమజ్జన ప్రాంతమైన కనిగిరి రోడ్డులోని పాతచెరువును సోమవారం సీఐ స్థానిక సిబ్బంది, గజ ఈతగాళ్లతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిమజ్జన సమయంలో ఎలాంటి పొరపాట్లు, ప్రమాదాలు జరగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు, నిమజ్జన ఊరేగింపుతో పాటు నిమజ్జన ప్రదేశంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటుచేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు. నిమజ్జన ప్రాంతానికి విగ్రహ ఏర్పాటు కమిటీ సభ్యులు తప్ప ఎవరు రావద్దని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సీఐ వెంట పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

336 బేళ్లు తిరస్కరణ

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సోమవారం నిర్వహించిన వేలంలో 336 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు వేలం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని అనకర్లపూడి, ముప్పరాజువారిపాలెం, పెరిదేపి, మిట్టపాలెం గ్రామాలకు చెందిన రైతులు 809 బేళ్లను వేలానికి తీసుకురాగా 473 బేళ్లను కొనుగోలు చేసి 336 బేళ్లను తిరస్కరించారు. గరిష్ఠ ధర రూ.299, కనిష్ఠ ధర రూ.140, సరాసరి ధర రూ.214.90గా నమోదైంది. వేలంలో 17 కంపెనీలు పాల్గొన్నాయి.

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సోమవారం నిర్వహించిన వేలంలో 219 పొగాకు బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. వేలం కేంద్రానికి తూర్పునాయుడుపాలెం, కాకుటూరివారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 914 బేళ్లను వేలానికి తీసుకురాగా 707 బేళ్లను కొనుగోలు చేసి 207 బేళ్లను తిరస్కరించారు. గరిష్ఠ ధర రూ.291, కనిష్ఠ ధర రూ.140, సరాసరి ధర రూ.201.89గా నమోదైంది. వేలంలో 40 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

లావణ్యను సన్మానించిన బీసీ నాయకులు



లావణ్యను సన్మానిస్తున్న బీసీ నాయకులు

కనిగిరిరూరల్: డీఎస్సీ 2025 ఎస్‌జీటీ పోస్టుల్లో జిల్లాలో ఫస్ట్ ర్యాంక్ సాధించిన గాలి లావణ్యను సోమవారం బీసీ సంక్షేమ సంఘ నాయకులు, తొగట వీర క్షత్రీయుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. . ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డుకాదని లావణ్య నిరూపించిందని పేర్కొన్నారు. పట్టుదలతో ఏదైనా సాధించవచ్చని నిరూపించిన లావణ్య పలువురి ఆదర్శనీయమన్నారు. పీవీ శేషయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్‌ఎస్‌కే అబ్దుల్ గఫార్, బీసీ సంఘాల నాయకులు దేవరాజుగట్టు శివకాశయ్య, ఈర్ల విజయరామరాజు, ఎం మాలకొండలరావు, పొట్లూరి మాలకొండయ్య, శిగ కృష్ణారావు, గోరిగే లక్ష్మీ నారాయణ, పట్నం నరసింహారావు, మాలకొండయ్య, ప్రసాద్, గాలి నాగేశ్వరరావు, బొప్పరాజు సుబ్బారావు, గౌడ్, చిన్న కాశయ్య, డాక్టర్ నంబుల మాల్యాద్రి, తిరుపాలు, బాబు, గాలి ఏడుకొండలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

కనిగిరిరూరల్: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని పలువురు పేర్కొన్నారు. స్థానిక డిపో ఆవరణలో సోమవారం స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో డీపీటీఓ సత్యన్నారాయణ, డీఎం మొహమ్మద్ సాయనా బేగం, మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్, కమిషనర్ పి.కృష్ణమోహన్ రెడ్డి, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు అన్నదానం

కనిగిరిరూరల్: స్నేహ హస్తం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులకు సోమవారం అన్నదానం చేశారు. సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు డి.సుధీర్‌బాబు మాట్లాడుతూ రోగులకు, వారి బంధువులకు, అనాథలకు, నిరాశ్రయులకు, మతి స్థిమితం లేనివారికి, వృద్ధులకు భోజన వసతి కల్పించినట్లు తెలిపారు. పేదల ఆకలి తీర్చడమే లక్ష్యంగా సంస్థ పనిచేస్తున్నట్లు వెల్లడించారు. స్నేహ హస్తం సభ్యులు మోహన్, శంకర్, మీరామొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



మాట్లాడుతున్న షేక్ ఇబ్రహీం షరీఫ్

టంగుటూరు: బాల్య వివాహాలతో ఎన్నో అనర్థాలు ఉన్నాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి షేక్ ఇబ్రహీం షరీఫ్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ షెడ్యూల్ ట్రైబ్స్‌లో బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. దీనిపై వారికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తహసీల్దార్ ఆంజనేయులు మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థతో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి దేవసేన కుమారి, సీడీపీఓ సీహెచ్ మల్లేశ్వరి, ప్రభుత్వ వైద్యులు బాలాజీ అశోక్, ఎస్సై నాగమల్లేశ్వరరావు, న్యాయ సేవా సహాయకులు వావిలాల సదాశివ శాస్త్రి పాల్గొన్నారు.

పశు పోషకులకు అందుబాటులో ఉండాలి

పీసీపల్లి: పశుపోషకులకు వెటర్నరీ అసిస్టెంట్లు ఎప్పుడూ అందుబాటులో ఉండాలని పశువైద్యాధికారి డాక్టర్ ఆవులరెడ్డి అన్నారు. స్థానిక పశువైద్యశాలలో వెటర్నరీ అసిస్టెంట్లకు ఇటీవల జరుగుతున్న సర్వేపై అవగాహన కల్పించారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. దానా జొన్నలు ఉచితంగా పంపిణీ చేస్తామని తెలిపారు.

మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలి



మాట్లాడుతున్న ఎంఈఓ ఆనందరావు

టంగుటూరు: ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరును పర్యవేక్షణ చేయాలని, మానసిక ఒత్తిడి తగ్గించుకోవాలి ఎంఈఓలు ఆనందరావు, తన్నీరు బాలాజీ అన్నారు. స్థానిక మండల విద్యా కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ శ్రీధర్ ప్రధానోపాధ్యాయులు వృత్తిలో మానసిక ఒత్తిడిని ఎలా తగ్గించుకోవాలనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన ఒత్తిడిని అర్థం చేసుకోవడం, ఒత్తిడి రకాలు, ఒత్తిడిలో ఉన్నప్పుడు కలిగే స్వల్పకాలిక, దీర్ఘకాలిక లక్షణాలు, వత్తిడి వల్ల కలిగే అనర్థాలు, ఒత్తిడిని అధిగమించడం ఎలానో తెలియచేశారు. ప్రధానోపాధ్యాయులు రాంబాబు, చలపతిరావు, అరుణ, రమణయ్య, సుధాకరరావు, పూర్ణ, దామచర్ల శ్రీధర్, శ్రీదేవి, రజనీ, విజయ తదితరులు పాల్గొన్నారు.

మండపాల వద్ద మత్తు పానీయాలు తాగరాదు



కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న ఎస్సై నాగమల్లేశ్వరరావు

టంగుటూరు: వినాయకుని మండపాల వద్ద మత్తు పానీయాలు సేవించరాదని ఎస్సై నాగమల్లేశ్వరరావు అన్నారు. వినాయక విగ్రహాల కమిటీ సభ్యులకు సోమవారం పోలీసులు సమావేశం ఏర్పాటు చేసి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ మైకులు, డీజేలు తక్కువ సౌండ్ తో వినియోగించుకోవాలన్నారు. అసభ్యకరమైన నృత్యాలు డాన్సులు పూర్తిగా నిషిద్ధమని హెచ్చరించారు. మండపాల దగ్గర మత విద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడకూడదన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో నిమజ్జనం జరిగేలా చూడాల్సిన బాధ్యత కమిటీ వారిపై ఉందన్నారు.

గ్రీవెన్స్ సెల్‌కు ఐదు అర్జీలు

వలేటివారిపాలెం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ తహశీల్దార్ నయిం అహ్మద్ అధ్యక్షతన సోమవారం గ్రీవెన్స్‌సెల్ నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ మండల ప్రజల నుంచి ఐదు అర్జీలు వచ్చినట్లు ఆయన తెలిపారు. పోకూరులో భూ సర్వేకు ఒక అర్జీ, పొలం ఆన్‌లైన్ చేయాలని నలదలపూరు, కలవళ్ల, శామీరపాలెం గ్రామాల నుంచి మూడు అర్జీలు వచ్చినట్లు, చుండి గ్రామం నుంచి ఇంటి స్థలం సర్వే చేయాలని ఒక అర్జీ వచ్చినట్లు పేర్కొన్నారు. అర్జీలను త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు.

తిరగని ఆర్టీసీ బస్సు స్టీరింగ్

- తప్పిన పెను ప్రమాదం



నిలిచిపోయిన ఆర్టీసీ బస్సును లాగుతున్న ట్రాక్టర్

కొండపి: కాలం చెల్లిన బస్సులను తిప్పుతూ ఆర్టీసీ అధికారులు ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. వివరాల్లోకి వెళితే..సోమవారం సాయంత్రం కామేపల్లి నుంచి ఒంగోలుకు వెళ్తున్న ఒంగోలు డిపో ఆర్టీసీ బస్సు స్థానిక కామేపల్లి సెంటర్ టర్నింగ్ వద్దకు వచ్చేసరికి స్టీరింగ్ పట్టుకుపోయింది. టర్నింగ్ తిరగకపోవడంతో డ్రైవర్ అప్రమత్తగా వ్యవహరించి బస్సును రోడ్డులో నిలిపివేశాడు. బస్సులోని ప్రయాణికులు అంతా ఒక్కసారిగా ఏం జరుగుతుందో అర్థం కాక ఆందోళన చెందారు. విషయం తెలుసుకున్న ప్రయాణికులు వెంటనే ఊపిరి పీల్చుకొని డ్రైవర్‌ను అభినందించారు. మహిళలకు స్త్రీ శక్తి పథకం ద్వారా ఉచిత బస్సులు సౌకర్యాన్ని ఆర్భాటంగా ప్రకటించి కాలం చెల్లిన బస్సులు వేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. బస్సు నిదానంగా ఉండడంతో పెను ప్రమాదం తప్పిందని, అదే ఎక్కడైనా ప్రయాణంలో స్టీరింగ్ కంట్రోల్ తప్పితే ఏమయ్యేదోనని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు. కామేపల్లి నుంచి ఒంగోలు వయా కొండపి నూతలపాడు మీదుగా నిత్యం బస్సుల్లో ప్రయాణికులు ఎక్కువ సంఖ్యలో ప్రయాణం సాగిస్తున్నారని అటువంటి మార్గంలో కాలం చెల్లిన బస్సులు వేసి ప్రయాణికులతో ఆడుకోకూడదని చర్చించుకుంటున్నారు. మూడు రోడ్ల కూడలిలో బస్సు ఆగిపోవడంతో టంగుటూరు వెళ్లే రహదారిలో తహసీల్దార్ కార్యాలయం వరకు, కట్టావారిపాలెం రహదారిలో పాత పంచాయతీ కార్యాలయం వరకు, బస్టాండ్ సెంటర్ వైపు బస్టాండ్ సెంటర్ వరకు దాదాపు 45 నిమిషాల పాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాహనదారులు ఆ సమయంలో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకున్న ఎస్సై ప్రేమ్ కుమార్ తన సిబ్బందిని సంఘటనా స్థలానికి పంపించారు. పోలీసులు బస్సును ట్రాక్టర్‌తో పక్కకు జరిపి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.